# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు పద్మ పురస్కారాలను అందజేశారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**3. వై.ఎస్.ఆర్. జిల్లా పులివెందుల శాసనసభ అభ్యర్థిగా వై. ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన రెడ్డి తరపున నామినేషన్ దాఖలైంది.**

**4. ఎన్నికల ప్రచారంలో వ్యయ పరిమితికి మించి ఖర్చు చేసే అవకాశం ఉన్న అభ్యర్థులపై నిరంతర నిఘా ఉంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అధికారులను ఆదేశించారు.**

**5. ఆంధ్రప్రదేశ్‌లో మే 24వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు..**

==========================

భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలో వివిధ రంగాలకు విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల ప్రదానం నిన్న డిల్లీలో జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయా ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు బిందేశ్వర్ పాఠక్ కు మరణానంతరం ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని ఆయన కుటుంబ సభ్యులు స్వీకరించారు. సినీ నటులు మిథున్ చక్రవర్తి , మాజీ గవర్నర్ రామ్ నాయక్, ప్రముఖ గాయని ఉషా ఊతప్ కూడా పద్మ భూషణ్ పురస్కారం అందుకున్నారు. తెలంగాణా లోని నారాయణ పేట కు చెందిన బుర్ర వీణ వాయిద్య కారుడు దాసరి కొండప్ప పద్మశ్రీ పురస్కారం స్వీకరించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో

విద్యుత్ సరఫరా పరిస్థితులపై ఆయన నిన్న సచివాలయంలో ఇంధన శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలనీ ,వీలైనంత వరకూ విద్యుత్ కోతలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలనీ సూచించారు. తాగునీటి సరఫరా పరిస్థితులు,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కల్పనపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడుతూ..... తాగు నీటి నిల్వ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపేందుకు వీలుగా ప్రకాశం బ్యారేజి నుండి  ఈనెల 29 తేదీ వరకు,నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ నుండి ఈనెల 25వ తేదీ వరకూ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తామని  తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా నిన్న  ర్యాలీలు నిర్వహించారు. వై.ఎస్.ఆర్.  కడప జిల్లా పులివెందుల శాసనసభ అభ్యర్థిగా వై. ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్  జగన్ మోహన రెడ్డి తరఫున పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్  వై.ఎస్ మనోహర్ రెడ్డి నిన్న  నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 25వ తేదీన  జగన్ మోహన రెడ్డి స్వయంగా మరో సెట్ నామినేషన్ వేసి, మిగతా నామినేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని ....  మనోహర్ రెడ్డి పాత్రికేయులకు తెలిపారు.. మరోవైపు టెక్కలి శాసన సభ అభ్యర్థిగా తెలుగు దేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు నిన్న నామపత్రాలు సమర్పించారు. ఉండి నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా రఘురామకృష్ణరాజు నామినేషన్ దాఖలు చేశారు.  విజయవాడలో తూర్పు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ  అభ్యర్థి గద్దె రామ్మోహన్, నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.

---------------------------

కేంద్రంలో గత పదేళ్లుగా అధికారంలో వున్నప్పటికీ తెలంగాణా రాష్ట్రానికి భారతీయ జనతా పార్టీ ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదు నగరంలోని మల్కాజిగిరి, నిజామాబాద్‌లలో  నిన్న జరిగిన ఎన్నికల సభలలో ఆయన మాట్లాడుతూ .....  ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన వెంటనే తెలంగాణా రాష్ట్రంలో రైతు రుణ మాఫీ ప్రక్రియ ప్రారంభమవుతుందనీ, ఎటువంటి పరిస్థితులలోనూ  ఆగష్టు 15 వ తేదీ లోపు రుణ మాఫీ కార్యక్రమం పూర్తి చేస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 17లోపు నిజామాబాద్ లో చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తామని  రేవంత్ రెడ్డి తెలిపారు.

---------------------------

ఎన్నికల ప్రచారంలో వ్యయ పరిమితికి మించి ఖర్చు చేసే అవకాశం ఉన్న అభ్యర్థులపై నిరంతర నిఘా ఉంచాలని ఆంధ్రప్రదేశ్  ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆయా నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. భీమవరంలో ఆయన నిన్న సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీనా నిగమ్ మాట్లాడుతూ నామినేషన్ల దాఖలు ప్రారంభం అయిన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలనీ, సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ సూచించారు. అభ్యర్థులు చేస్తున్న ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై దృష్టి సారించాలనీ,బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తంలో జరిగే లావాదేవిలు, నగదు డిపాజిట్లను పరిశీలించాలనీ ఆయన సూచించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులకు వచ్చే మే 24 వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సురేష్ ప్రకటించారు. ఈ పరీక్షల కోసం ఈ రోజు నుండి ఫీజు చెల్లించవచ్చునని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కేవలం ఆన్ లైన్ లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని, విద్యార్థులు వారి వారి పాఠశాలల నుండి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సురేష్ సూచించారు.

---------------------------

తెలంగాణలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు రేపు ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విడుదల చేస్తారని పేర్కొంది. ఇలా ఉండగా 10వ తరగతి పరీక్షా ఫలితాలు ఈనెల 30వ తేదీన విడుదల అవుతాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వస్తే , మెగా డిఎస్‌సి పైనే తొలి సంతకం చేస్తుందని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా జగ్గంపేట, విజయనగరం జిల్లా శృంగవరపుకోటలలో "ప్రజాగళం "పేరుతో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలలో ఆయన మాట్లాడుతూ ... రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా ఎన్నికల మేనిఫెస్టో ను రూపొందించామని తెలిపారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తామనీ, ఆర్.టి.సి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు . రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే నాలుగు వేల రూపాయల పింఛను ఇస్తామనీ, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ను ప్రగతి పథంలో నడిపించడానికే తెలుగు దేశం , జన సేన , భారతీయ జనతా పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని చంద్రబాబునాయుడు తెలిపారు.

---------------------------

జనసేన పార్టీ అధ్యక్షులు కె .పవన్ కల్యాణ్ ఈరోజు నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు చేబ్రోలు నుంచి గొల్లప్రోలు మీదుగా పిఠాపురం పాదగయ వరకు ర్యాలీగా తరలివెళ్లి పవన్ కల్యాణ్ నామినేషన్ వేస్తారనీ, సాయంకాలం ఉప్పాడలోని ప్రధాన కూడలిలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపాయి.

---------------------------

కడప జిల్లా ఒంటిమిట్టలో నిన్న సాయంత్రం శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శ్రీరాముని ఆలయాలలో శ్రీరామ నవమి రోజున కళ్యాణం నిర్వహిస్తుండగా... ఒంటి మిట్ట పుణ్య క్షేత్రంలో మాత్రం నవమి తరువాత చతుర్దశి రోజున పండు వెన్నెలలో శ్రీ సీతారాముల కళ్యాణ కార్యక్రమం జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి దృష్ట్యా ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన రెడ్డికి బదులుగా దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ అభ్యర్థుల మరో జాబితాను కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. గతంలో 114 స్థానాలకు వెల్లడించగా.. తాజాగా 38 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన 10 స్థానాల్లో అభ్యర్థులను మార్చినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ఇప్పటి వరకు 142 స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఇండియా కూటమి పొత్తులో భాగంగా అరకు లోక్ సభ తో పాటు 8 అసెంబ్లీ సీట్లను సీపీఎంకు కేటాయించారు. రాష్ట్రంలోని 25 లోక్ సభ స్థానాల్లో ఇప్పటి వరకు 20 చోట్ల అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. పొత్తులో ఒకటి సీపీఎంకు కేటాయించడంతో మరో నాలుగు లోక్ సభ, మిగిలిన అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

-----------------------------

తెలంగాణ లో రానున్న మూడు రోజుల పాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ లోని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఆదిలాబాద్ ,కొమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================